

38వ డివిజన్ రుద్రమాంభనగర్‌లోని ఓ పాఠశాలలో బతుకమ్మ పేర్చుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కాశీబుగ్గ సరస్వతి పాఠశాలలో..

బడుల్లో బతుకమ్మ సంబరాలు

జిల్లావ్యాప్తంగా మంగళవారం పాఠశాలలు, కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బుధవారం నుంచి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా వేడుకలు జరిపారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి.. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆడిపాడారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన విద్యార్థులు సందడి చేశారు. – న్యూస్‌టుడే, కాశీబుగ్గ, శివనగర్

(మరిన్ని చిత్రాలు 9లో..)

ఈనాడు వరంగల్

బుధవారం అక్టోబరు 2, 2024


రూ.2,261.85 కోట్ల రుణాల మంజూరు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,642.62 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకోగా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.2,261.85 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు జిల్లా పాలనాధికారి డా.సత్యశారద వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో జరిగిన మొదటి త్రైమాసిక జిల్లా కన్సల్టేటివ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం స్వనిధి పథకంలో భాగంగా ఇప్పటివరకు 57,212 మంది వీధి వ్యాపారులకు మెప్మా ద్వారా రుణాలు మంజూరు చేశామన్నారు. పంట రుణాలకు సంబంధించి 1,802.08 కోట్లు లక్ష్యం పెట్టుకోగా.. గత జూన్ వరకు 351.16 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. వ్యవసాయ రంగానికి రూ.988.84 కోట్లు, భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.541.51 కోట్లు, ప్రాధాన్య రంగాలకు రూ.1,586.91 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.318.49 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అనంతరం వార్షిక రుణ ప్రణాళిక నివేదిక విడుదల చేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలీ రాజు, ఆర్బీఐ ఏజీఎం పల్లవి, నాబార్డ్ ఏజీఎం రవి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల సర్వే

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: చారిత్రక శ్రీ గోవిందరాజస్వామి దేవాలయ భూముల సర్వేను దేవాదాయశాఖ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని.. స్థానికులు కొందరు లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆలయ భూమిలో 2.27 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పూర్తి నివేదికను లోకాయుక్తకు సమర్పిస్తామని, తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు వెల్లడించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సునీత, డీఐ నాగభూషణ్, ఏడీ సర్వే దేవరాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి నరేందర్, సిటీ ప్లానర్, సర్వేయర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి మాట.. పూలబాట!



● పల్లెలు మురవాలి.. గాంధీజీ ఆశయం నెరవేరాలి ఉయ్యాలో..

మనిషి అవసరాలను తీర్చడానికి తగినంత భూమి ఉంది కానీ మనిషి దురాశను తీర్చడానికి సరిపోదు..

బుద్ధి వికాసానికి అనువైన చోట్లు పల్లెసీమలే.. పట్టణాలు నగరాలు కానే కావు.

ఎక్కడ ప్రేమ ఉందో అక్కడ దేవుడు ఉన్నాడు..

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

గ్రామాల అభివృద్ధి కోసం మహాత్ముడు కలలు కన్నారు.. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని తపించారు. గొప్ప వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచిన ఆయన బోధనలు బతుకమ్మ పండగలోనూ కనిపిస్తాయి.. బతుకమ్మ అంటే జీవిత పండగ అని అర్థం. నిత్యం పంటలతో సుభిక్షంగా ఉంటూ వేడుకలా సాగాలని పార్వతీదేవిని మహిళలు వేడుకుంటారు. గాంధీ కోరుకున్నదీ పల్లెలు పచ్చగా ఉండాలనే. అందుకే బతుకమ్మ పండగలో గాంధీ ఆశయాలు కనిపిస్తాయి. అక్టోబరు 2 గాంధీ జయంతి.. మరో వైపు వైభవంగా జరిగే బతుకమ్మ పండగ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మహాత్ముడి ఆశయ సాధనలో ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి పల్లెల గురించి కథనం..

ఆరుగుంటుపల్లి.. పారిశుద్ధ్యంలో ఆదర్శం

ఇంకుడుగుంతల నిర్మాణంలో ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఆరుగుంటుపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 125 మంది జనాభా ఉండగా, 38 నివాసాలున్నాయి. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవడంతో.. గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి వేసవిలో కూడా నీటి సమస్య రాలేదని స్థానికులు చెబుతున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీవో భవాని గ్రామస్థులకు సహకరించడంతో పరిశుభ్రతలో, వందశాతం ఇంకుడు గుంతలు నిర్మించుకున్న గ్రామంగా ఆరుగుంటపల్లి నిలిచింది. –న్యూస్‌టుడే, వాజేడు



రాణా మెట్లెక్కని.. మెట్లతిమ్మాపురం



పది దశాబ్దాల చరిత్ర గల ఆదివాసీగూడెం.. సత్యం.. ధర్మం అనే గాంధీజీ సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ఊరిలో ఎవరి మధ్యనైనా గొడవ.. ఘర్షణ జరిగితే పరిష్కారం కోసం ఇప్పటి వరకు ఠాణా మెట్లెక్కలేదు. ఎలాంటి సమస్యలు వచ్చినా గ్రామంలోని పెద్దలు చర్చించి సామరస్యంగా పరిష్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలోని అడవి మధ్యన ఉన్న **మెట్లతిమ్మాపురం** ప్రత్యేకత ఇది.. 130 కుటుంబాలు, 750 మంది జనాభా 412 మంది ఓట్లు కలిగిన ఈ గూడెం ప్రజల్లో కల్మషం, విద్వేషాలు ఏమాత్రం కనిపించవు. కలిసిమెలిసి జీవనం కొనసాగిస్తున్నారు. 'సమస్య పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా.. గ్రామ పెద్దల మధ్యనైనా ఎక్కడైనా జరిగేది న్యాయమే. అందుకే గ్రామ పరువును కాపాడుకునేందుకు స్టేషన్‌కు వెళ్లకుండా ఇరువర్గాల వారు తీర్పును మెచ్చేలా పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకుంటున్నాం. ఇది మా పూర్వీకుల నుంచి కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తాం అని ఊరి దొర బిజ్జ నర్సింహారావు, పటేల్ తాటి కృష్ణ వివరించారు.

● వ్యవసాయంపైనే ఆధారపడిన వీరు ఎక్కువగా వరి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేస్తారు. వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించుకున్నారు. మురుగునీరు వీధుల్లో పారకుండా ఇంటింటా ఇంకుడు గుంతలను నిర్మించుకుని స్వచ్ఛతలో శెభాష్ అనిపించుకుంటున్నారు.

● గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులున్నా ఎక్కడా ఏ పార్టీ జెండాలు, స్తూపాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు కనిపించవు. సుమారు 15 ఏళ్ల నుంచి మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారు. అమ్మకాలు చేస్తే రూ.10 వేల జరిమానా విధిస్తున్నారు.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, బయ్యారం

అన్నింట్లో ఆదర్శం

గూడెం ప్రజలు వేలిముద్రలు వేయకూడదనే ఉద్దేశంతో సుమారు 32 ఏళ్ల కిందటనే అప్పటి పెద్ద రామయ్య కనీసం వారందరూ పేర్లు రాసేలా.. బస్సుల పేర్లు తెలిసేలా అక్షరాలు నేర్పించారు. ఆ తర్వాత అక్షరదీపం కార్యక్రమం కింద రాత్రిబడిలో ప్రతి ఒక్కరూ అక్షరాలు నేర్చుకొని 2005లో నాటి భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రశంసలు పొందారు.

● గ్రామస్థుల కోసం అభయ, 100 స్మైల్ ఫౌండేషన్ సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేసినా కొత్తపుస్తకాలు ఇచ్చే వారు లేరు.

● డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్ చదివినవారు 45 మంది వరకు ఉన్నారు. టీచర్లు 13 మంది ఉన్నా ఇందులో పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన అమ్మాయిలున్నారు. పోలీస్, అటవీ శాఖ ఉద్యోగులు నలుగురున్నారు. ఇందులో ఒకరు మహిళా రిజర్వుడు ఎస్‌ఐ ఉన్నారు.

ఆ రెండు గ్రామాల్లో సంపూర్ణ మద్యనిషేధం



గంగదేవిపల్లి

గీసుకొండ: సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేస్తూ ఆ రెండు గ్రామాలు గాంధీజీ కలలను నిజం చేశాయి. అవే వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి, మరియపురం గ్రామాలు. గంగదేవిపల్లి ఇరవై ఏళ్ల క్రితమే జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎంపికవగా మరియపురం మూడేళ్ల కిందట ఆ స్థానం సంపాదించింది. గంగదేవిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూసం రాజమౌళి నేతృత్వంలో 40 ఏళ్ల కిందటే ఇక్కడి ప్రజలు సారాపై ఉద్యమించి విజయం సాధించారు.



మరియపురం

● గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం వల్లే జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. ఈ గ్రామానికి మరియపురం ఆనుకునే ఉంటుంది. గంగదేవిపల్లి ప్రభావం ఈ గ్రామం మీద కనిపిస్తుంది. నిర్మల బుక్ బైండింగ్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం బాలిరెడ్డి 2019లో ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికైన తర్వాత గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు కదిలారు. సారాతోపాటు మద్యం గొలుసు దుకాణాలను అరికట్టి సంపూర్ణ మద్యనిషేధ గ్రామంగా తీర్చిదిద్దారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన నిధులను సద్వినియోగం చేసుకుని బాలిరెడ్డి లక్షలాది రుపాయలు సొంత నిధులను వెచ్చించి కేవలం ఐదేళ్లలోనే జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా నిలిపారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ చిత్రంలో మేయర్ సుధారాణి, పాలనాధికారి సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ

కరీమాబాద్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పాలనాధికారి డా.సత్యశారద అధ్యక్షతన ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నగర మేయర్ గుండు సుధారాణి, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీలతో కలిసి పండగ ఏర్పాట్లపై సమీక్షించారు. సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.

● మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. రహదారుల మరమ్మతులు, చెరువుల వద్ద విద్యుద్దీపాలతో అలంకరణ వంటి వసతులు కల్పించాలన్నారు. నగర పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మ, డీసీపీ సలీమా, అదనపు పాలనాధికారి సంధ్యారాణి, అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ, దసరా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపూరి సంజయ్‌బాబు, మేడిది మధు, కోశాధికారి వెంకన్నగౌడ్, శివమూర్తి, రాంప్రసాద్, యుగేందర్‌గౌడ్ పోలీసు, నీటిపారుదల, విద్యుత్తు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కటిక నేలపై.. కష్టంగా చదువులు



నర్సంపేటలోని మహాత్మా జ్యోతిబా పులే గురుకుల విద్యాలయ బాలికల దుస్థితి ఇది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 380 మంది విద్యార్థినులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. 6- 9 తరగతుల వరకు 305 మంది విద్యార్థినులకు బెంచీల్లేక ఇలా నేలపై కూర్చొని చదువుకుంటున్నారు. వంగి రాయడం, చదవడంతో నడుం, మెడ నొప్పులు వస్తున్నాయని బాలికలు వాపోతున్నారు. ఈ విషయమై గురుకుల ప్రిన్సిపల్ మంగ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా డెస్క్ బెంచీల కోసం సొసైటీకి ప్రతిపాదనలు పంపామన్నారు. న్యూస్‌టుడే, నర్సంపేట

బల్దియాలో దొంగల బెడద

కార్పొరేషన్, న్యూస్‌టుడే: బల్దియా ప్రధాన కార్యాలయాన్ని దొంగల భయం వెంటాడుతోంది. అయిదురోజుల క్రితం సాయంత్రం వేళ ఇనుప గ్రిల్స్ ఎత్తుకెళ్లేందుకు వచ్చిన దొంగను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మరువకముందే సోమవారం అర్ధరాత్రి దుండగులు 'గ్రీనరీ లాన్' చుట్టూ ఉన్న పిట్టగోడ కూల్చేసి కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ అపహరించారు. మంగళవారం ఉదయం విషయం వెలుగులోకి వచ్చింది. ఈ పని చేసింది బయటి వారా? ఇంటి దొంగలా? అని తెలియాల్సి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నేతలతో సమీక్షలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

ఈనాడు, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను చేపడుతున్నందున వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. ఓరుగల్లులో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. తాజాగా భారాస జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్ అరెస్టు, భారాస, కాంగ్రెస్ శ్రేణుల మధ్య హనుమకొండలో జరిగిన తోపులాట అంశాన్ని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పొంగులేటికి వివరించినట్టు సమాచారం. ప్రతిపక్షాల విమర్శలను రాష్ట్ర, జిల్లా స్థాయిలో నేతలు తిప్పి కొట్టాలని మంత్రి నేతలకు సూచించారు. వరంగల్ ఎంపీలు బలరాం నాయక్, కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై సమీక్ష

వరంగల్ కలెక్టరేట్: జిల్లాలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై సంబంధిత అధికారులతో జిల్లా పాలనాధికారి డా.సత్యశారద కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మైనింగ్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదికలు సమర్పించాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులకు సూచించారు. మైనింగ్‌తో సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి సమీక్షించారు.

పండగ పనులు పంచేసుకున్నారు!

● ఉత్సవాలకు సుమారు రూ.కోటి పైనే ఖర్చు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'పనుల అంచనా ధర పెంచుకో.. పర్సంటేజీలు దండుకో' అన్నట్లుగా ఉంది గ్రేటర్ వరంగల్ ఇంజినీర్ల తీరు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్ల పనుల ప్రతిపాదనలు అడ్డగోలుగా పెంచేశారు. గతేడాది కంటే 40-50 శాతం పెరగడం గమనార్హం. అంతటితో ఆగకుండా ఆ పనులను తమకు ఇష్టమైన వారికి అప్పగిస్తున్నారు. రాజకీయ సిఫార్సులు, ఇంజినీరింగ్ అధికారులకు దగ్గరగా ఉండే గుత్తేదారులకు నామినేషన్‌పై పనులు కేటాయిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

నగరంలోని 66 డివిజన్లలో సద్దుల బతుకమ్మ ఆడే చెరువులు, కుంటలు, మైదానాల వద్ద తాత్కాలిక పనులు, విద్యుద్దీపాల అలంకరణ ఇతర పనుల కోసం ఈ ఏడాది సుమారు రూ.కోటి పైనే ఖర్చు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇంజినీరింగ్ సివిల్, ఎలక్ట్రికల్ పనులకు టెండర్లు నిర్వహించకుండా.. పనులు నామినేషన్‌పై కేటాయించడం వెనుక పెద్దఎత్తున కమీషన్లు చేతులు మారుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ఇంజినీరింగ్ అధికారి కనుసన్నల్లో పనుల పంపకాలు జరుగుతున్నాయని తెలిసింది.

నక్కలగుట్ట సర్కిల్‌లో 10...

● హనుమకొండ నక్కలగుట్ట సర్కిల్-3 పరిధిలో రూ.26.77 లక్షలతో ప్రతిపాదించిన 10 పనులకు టెండర్లు నిర్వహించకుండా.. నామినేషన్‌పై కేటాయించారు. అదే బహిరంగ టెండర్లు పిలిచి ఉంటే 15-20 శాతం తగ్గించేవారు. ప్రజాధనం ఆదా చేయాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. గతేడాది రూ.16.27 లక్షలు ఖర్చు పెడితే ఈసారి రూ.26.77 లక్షలకు పెంచారు.

● 1వ డివిజన్‌లో రూ.1.30 లక్షలు, 2లో రూ.1.20 లక్షలు, 4లో రూ.లక్ష, 5లో రూ.లక్ష, 11లో రూ.4.98 లక్షలు, 52, 54లో రూ.4.10 లక్షలు, 55లో రూ.3.50 లక్షలు, 56లో రూ.4.20 లక్షలు, 65లో రూ.4.50 లక్షలు, 66వ డివిజన్‌లో రూ.లక్ష చొప్పున పనులకు టెండర్లు పిలవకుండా నామినేషన్‌పై కేటాయించారు.

● వరంగల్ కాశీబుగ్గ సర్కిల్ పరిధిలో, ఎలక్ట్రికల్ పనులు ఎవరికి కేటాయించారో తెలియకుండా ఇంజినీర్లు గోప్యత పాటిస్తున్నారు. రాజకీయ పైరవీలతో నచ్చిన గుత్తేదారులకు నామినేషన్ పనులు కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది.

కరీంనగర్, నిజామాబాద్ జట్ల శుభారంభం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మంగళవారం కోమటిపల్లి క్రీడా మైదానంలో పూల్ 'బి'లోని ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా జట్లు, మొగిలిచర్ల మైదానంలో ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు నువ్వా- నేనా అన్నట్లు సాగాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆదిలాబాద్ జట్టు 28.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఛేదనలో బరిలోకి దిగిన నిజామాబాద్ జట్టు 27.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం 25.4 ఓవర్లలో 99 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఛేదనలో కరీంనగర్ జట్టు కేవలం 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. బుధవారం మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, ఖమ్మం: కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నిజామాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



వృద్ధులను సత్కరిస్తున్న పాలనాధికారి డా.సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరి జీవితంలో అవసానదశ తప్పక వస్తుందని, పెద్దలను గౌరవించడం చిన్నతనం నుంచే పిల్లలకు అలవాటు చేయాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద తల్లిదండ్రులకు సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవితంలో ఎన్నో అనుభవాలను చవిచూసిన వృద్ధుల అనుభవాలు అమూల్యమైనవని, అవి నేటితరం పిల్లలకు అవసరమన్నారు. ఉత్సాహవంతులైన వృద్ధులెవరికైనా.. తమ జీవిత పాఠాలను.. విద్యార్థులతో పంచుకోవాలనే ఆసక్తి ఉంటే.. పాఠశాలల్లో పాఠ్యాంశాలుగా చెప్పేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం 102 ఏళ్ల వృద్ధుడు మాధవరావు, వయోవృద్ధుల కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అదనపు పాలనాధికారి జి.సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా సంక్షేమశాఖ అధికారి హైమావతి, డీఈఓ జ్ఞానేశ్వర్, డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆడపడుచులు వారి తల్లిగారింటికి బయలుదేరుతారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు ప్రకటించడంతో పిల్లలతో ఎంత కష్టమైనా సొంతింటికి వెళతారు. ఓరుగల్లు ప్రజలు ఎక్కువగారైళ్లలో ప్రయాణిస్తారు. ఈసారి పండగకు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మూడోలైను పనుల కారణంగా వరంగల్, కాజీపేట నుంచి వెళ్లే రైళ్లను ఈ నెల 7 వరకు రద్దు చేశారు. ప్రత్యేక రైళ్లను ప్రకటించినా వాటిలో చాలా వరకు రద్దయ్యాయి. దీంతో అందరూ బస్సులనే ఆశ్రయించాల్సి వస్తోంది. బతుకమ్మ, దసరా పండగకు వరంగల్ ఆర్టీసీ అదనపు బస్సులను మంగళవారం నుంచి నడిపిస్తోంది. రైలు ప్రయాణికులంతా వాటినే ఆశ్రయిస్తారు కాబట్టి రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో కొందరు సొంత వాహనాల్లో పయనం కావడానికి సిద్ధమవుతున్నారు. చౌకగా ప్రయాణం చేసే రైళ్లు రద్దు కావడం అందరికీ భారంగా మారింది..

–కాజీపేట, హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే





పండగ వేళ.. ప్రయాణం భారం!

రైళ్ల రద్దు.. బస్సుల్లో రద్దీ


రైళ్లు రద్దు కావడంతో వెల వెల పోతున్న కాజీపేట రైల్వే స్టేషన్


ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్

ఛార్జీల వివరాలు (రూ.)

బస్సు		రైలు
300	వరంగల్- హైదరాబాదుకు	80
275	వరంగల్- ఖమ్మం	75
250	వరంగల్- రామగుండం	70

అదనపు భారం రూ.2 వేలు

రైళ్లు లేకపోవడంతో ఈసారి బస్సు ప్రయాణం తప్పదు. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నా రద్దీని తట్టుకోవడం కష్టం. దీంతో ఛార్జీలు అధికంగా ఉండే డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి ఉన్నత స్థాయి బస్సులను ఆశ్రయించాల్సిందే. వాటిలోనూ సీట్లు దొరకడం కష్టం.

ఇదీ పరిస్థితి: ఇంట్లో నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణం చేయాలనుకుంటే రైలు ఛార్జీతో పోలిస్తే ఒక్కొక్కరికి బస్సులో రూ.200 నుంచి రూ.225 వరకు ఎక్కువ అవుతుంది. దీనికి తోడు ఆటోలు, ఇతర రవాణా ఛార్జీలు కలుపుకొని కుటుంబానికి రానుపోను రూ.2000 వరకు అదనపు భారం పడుతుంది.

ముందస్తు ప్రయాణం మేలు

పండగకు ముందురోజు కంటే ఒకటి, రెండు రోజుల ముందే ప్రయాణం కడితే కొంత రద్దీని తట్టుకోవచ్చు. చాలా మంది సాయంత్రం విధులు ముగించాక బయలుదేరుతారు. కాస్త ముందుగా బయలుదేరితే ఆర్టీసీకి కాస్త వెసులుబాటు లభిస్తుంది.

● ఇప్పుడు చాలా మందికి కార్లు ఉంటున్నాయి. కాబట్టి కాస్త ఖర్చు ఎక్కువైనా కారు లేదా ఇతర వాహనాలు వాడితే సామాన్య ప్రజలకు బస్సుల్లో కాస్త వెసులుబాటు ఉంటుంది.

బల్లార్ష మార్గంలో బహుకష్టం

బల్లార్ష మార్గంలో పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గమే సులువు.. చౌకగా వెళ్లొచ్చు. రైళ్లు రద్దు చేయడంతో కరీంనగర్ మీదుగా బస్సులో వ్యయప్రయాసలతో ప్రయాణించాల్సిందే.

నిండిన బెర్తులు: దసరా పండగకు కోల్‌కతా, ఒడిశా, బెంగళూరు, మైసూరు, తిరుపతి ప్రాంతాలకు ఎక్కువగా వెళుతుంటారు. ఈమార్గంలో రైళ్లకు చాంతాండంత వెయిటింగ్ లిస్టు ఉంది. హౌరా, యశ్వంతాపూర్, పద్మావతి రైళ్లల్లో బెర్తులు లేవని చూపిస్తున్నాయి.

గతేడాది అక్టోబరులో దసరా, బతుకమ్మ పండగ నేపథ్యంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణించినవారి సంఖ్య (రోజుకు సగటున)

● మార్గం	● ప్రయాణికుల సంఖ్య	● సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య	● తేడా
వరంగల్-కాజీపేట- సికింద్రాబాద్	16,000	9,500	6,500
కాజీపేట-వరంగల్- ఖమ్మం	13,000	8,500	4,500
కాజీపేట - వరంగల్- బల్లార్ష	15,000	6,500	7,500

ప్రైవేటు వాహనాలకు గిరాకీ



ప్రైవేటు వాహనాలకు గిరాకీ బాగా పెరిగింది. ఇప్పటికే వరంగల్‌లోని ట్రావెల్స్‌ల్లో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు బతుకమ్మకు ముందు రోజున బుక్ అయ్యాయి. డిమాండ్ పెరగడంతో ఆ రోజు ప్రయాణానికి అదనంగా వసూలు చేయనున్నారు.

నేటి నుంచి 850 అదనపు బస్సులు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: వరంగల్ రీజియన్‌లో 850 బస్సులను (ట్రిప్పులు) నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎక్కువగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలకు తిరుగుతాయి. దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులను ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ఇవి నడుస్తాయి. పండగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా 13, 14, 15 తేదీల్లో రద్దీకి అనుగుణంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు సైతం బస్సులు నడపనున్నారు. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉండటంతో గతేడాది కంటే అదనంగా బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు.

● హనుమకొండ బస్టాండు నుంచి హైదరాబాద్ రూట్లో నిత్యం 250 బస్సులు నడుస్తుంటాయి..దాదాపు 400 ట్రిప్పులు. పండగ సందర్భంగా అదనంగా 150 బస్సులు నడిపిస్తారు.. ● ఖమ్మం, మహబూబాబాద్ రూట్లలో వరంగల్ రీజియన్ నుంచి హనుమకొండ, మహబూబాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నడుస్తాయి. 25 బస్సులు ఖమ్మం వరకు ఉంటాయి. మహబూబాబాద్ నుంచి ఖమ్మం వరకు మరికొన్ని బస్సులు నిత్యం నడుస్తాయి. ఈ మార్గంలో అదనంగా మరో 50 బస్సులను పెంచనున్నారు.

ట్రిప్పుల సంఖ్య పెంచాలి..

-మాడిశెట్టి చంద్రశేఖర్, హనుమకొండ



గతంలో రైళ్లలో ప్రయాణించేవాళ్లం.. ఈసారి అవి రద్దయ్యాయి. దీనితో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంది. రైళ్లు నడిచే మార్గంలో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడిపించాలి. ట్రిప్పుల సంఖ్య పెంచాలి. రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలి.

అదనపు భారం

-గద్దల సతీష్, ప్రయాణికుడు



మా స్వగ్రామం మంచిర్యాల దేవనూరు. మా బంధువులు అంతా అక్కడే ఉంటారు. మేము హనుమకొండకు వచ్చి దాదాపు 15 ఏళ్లు అవుతోంది. అప్పుడప్పుడు మా గ్రామానికి వెళ్లి వస్తుంటాం. ఈ ఏడాది దసరాకు వెళ్దామని అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఇంతలోనే రైళ్లు రద్దు అని చెబుతున్నారు. బస్సులో వెళ్తే ప్రయాణ భారంతో పాటు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. ఈ సమయంలో రైళ్లు రద్దు చేయడం సరికాదు.. పండగలు ముగిసిన తర్వాత ఆ నిర్ణయం తీసుకుంటే బాగుండేది

డిపోల వారీగా నడిపే ప్రత్యేక బస్సులు

వరంగల్-1	125
వరంగల్-2	125
హనుమకొండ	125
పరకాల	93
నర్సంపేట	119
జనగామ	120
తొర్రూరు	48
మహబూబాబాద్	47
భూపాలపల్లి	48

రేపటి నుంచి శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు

● 10న సద్దుల బతుకమ్మ.. 12న దసరా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కార్యనిర్వహణ అధికారిణి శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు వెల్లడించారు. 10న మహానవి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి జన్మోత్సవం, సద్దుల బతుకమ్మ, 12న విజయదశమి(దసరా) ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. శ్రీదేవి శరన్నవరాత్రులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తారని, ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులకు వాహన సేవలుంటాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, చింత శ్యాంసుందర్, అర్చకుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

రోజు వారీగా కార్యక్రమాలు..

- 2న ఉదయం హరిద్రాదర్శనం శరన్నవరాత్రయాగ పూర్వాంగనిధి, సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ
- 3న భేరి పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన, అమ్మవారిని శైలపుత్రిక్రమము బాలా త్రిపురసుందరి అలంకరణ, ఉదయం 11 గంటలకు వృషభ వాహనసేవ, సాయంత్రం మృగ(జింక) వాహనసేవ
- 4న అన్నపూర్ణాలంకారం, బ్రహ్మచారిణి దుర్గార్చన, మకర, చంద్రప్రభ వాహనసేవలు
- 5న గాయత్రి అలంకరణ, చంద్రఘంటా దుర్గార్చన, సింహ, గజ వాహనసేవలు
- 6న శ్రీమహాలక్ష్మి అలంకరణ, కూష్మాండీ దుర్గార్చన, సూర్యప్రభ, హంస వాహనసేవలు
- 7న లలితా పంచమి శ్రీరాజరాజేశ్వరి లలితా మహాత్రిపుర సుందరి, స్కందామాత దుర్గార్చన, పల్లకీ సేవ, శేషవాహన సేవ
- 8న భవాని అలంకరణ, కాత్యాయని దుర్గార్చన, గంధోత్సవం, చాముండ దుర్గార్చన, సాలభంజిక సేవ
- 9న శ్రీ సరస్వతీమాత, కాళరాత్రి దుర్గార్చన, రాత్రి అమ్మవారికి రథోత్సవం
- 10న మహాష్టమి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, మహా దుర్గా అలంకారం, మహా గౌరి దుర్గార్చన, భద్రపీఠ సేవ, అశ్వవాహన సేవ, సద్దుల బతుకమ్మ
- 11న మహా నవమి మహిషమర్ధిని అలంకరణ, శుంభు దుర్గార్చన, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం సర్వభూపాల వాహనసేవ
- 12న విజయ దశమి, శమీ పూజ, శ్రీభద్రకాళి అమ్మవారికి మహా పట్టాభిషేకం, నిజరూప దర్శనం, రాత్రి భద్రకాళి చెరువు(తటాకంలో)లో శ్రీభద్రకాళి భద్రేశ్వరులకు తెప్పోత్సవం
- 13న సాయంత్రం శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం.

రూపుదిద్దుకుంటున్న కాజీపేట వంతెన

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

● రాయ్‌పూర్‌లో సిద్ధమవుతున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

కాజీపేట వద్ద నిర్మాణంలో ఉన్న రెండో ఆర్వోబీపై బిగించేందుకు ఉక్కుతో తయారు చేస్తున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో సిద్ధమవుతోంది. నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెలాఖరుకు విడిభాగాలు ఇక్కడకు తీసుకొస్తారు. విల్లు ఆకారంలో ఉక్కుతో ఉన్న ఈ భాగాన్ని రైల్వే పట్టాలపై నిపుణులు బిగించనున్నారు. రాష్ట్రంలో ఇలాంటి తరహా వంతెన ఇప్పటి వరకు ఎక్కడా లేదని.. కాజీపేటపై రెండో ఆర్వోబీపై వచ్చేది మొదటిది అని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

- శంకుస్థాపన - 2017
- టెండర్లు పిలిచింది - 2019
- పూర్తి కావాల్సింది - 2020
- పనులు ప్రారంభమైంది - 2021
- మొత్తం అంచనా వ్యయం - రూ.45 కోట్లు
- 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగం నిర్మాణానికి - రూ.20 కోట్లు
- వెడల్పు - 9.5 మీటర్లు
- ఎడమవైపు పాదచారుల దారి - 1.5 మీటర్లు.


తయారీ దశలో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

మరో రూ.16 కోట్లు విడుదల చేయాలి

ఈ వంతెనను వేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ అనే గుత్తేదారు సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థకు ప్రభుత్వం ఇంకా రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్షించి ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా నిధులు ఇంకా గుత్తేదారుకు అందలేదని, అందుకే వంతెన నిర్మాణం నిలిచిపోయినట్టు సమాచారం. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి నిధులను వెంటనే విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయి.

విల్లు ఆకారమే ప్రత్యేకం

కాజీపేటలో ఉన్న పాత ఆర్వోబీకి కొత్త వంతెన పూర్తి భిన్నంగా ఉంటుంది. దీన్ని 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' గా పిలుస్తారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైళ్ల రాకపోకలకు ఏమాత్రం అంతరాయం లేకుండా వంతెన నిర్మాణాన్ని కొనసాగించేందుకు ముందే సిద్ధం చేసిన 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'ను వంతెనపై బిగించనున్నారు. వంతెనను 21 స్తంభాలతో నిర్మిస్తుండగా, ఇందులో రైల్వే లైన్ల పైభాగంలో మాత్రం విల్లు ఆకారంలో ఉండే నిర్మాణం మొత్తం ఉక్కు మిశ్రమంతో ఉంటుంది. దీనికి ఆధారంగా మూడు పిల్లర్లు ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. రైల్వే పట్టాలపై 800 టన్నుల బరువుతో 250 అడుగుల పొడవుతో రెండు భాగాలు ఉంటాయి. అంటే మొత్తం 1600 టన్నుల బరువు, 500 అడుగుల పొడవుతో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగాలను రాయ్‌పూర్‌లో సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే మన ఇంజినీర్లు అక్కడికి వెళ్లి దాన్ని పరిశీలించారు. 'ఈనాడు' ఆ చిత్రాలను ప్రత్యేకంగా సంపాదించింది. ప్రస్తుతం ఉన్న వంతెన కన్నా కొత్త వంతెన ఎక్కువ ఎత్తుతో ఉండనుంది.



కేయూలో విజిలెన్స్ విచారణ


కేయూ అధికారులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యానగర్,న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి టి.రమేష్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ఎ.బాలకోటి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు జి.రాకేష్, బి.అనిల్, హస్నన్, ఎఫ్ఆర్ఓ గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు కేయూకు వచ్చారు. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, పరీక్షల నియంత్రణ అధికారులను విచారించారు. ప్రొఫెసర్లను సీనియర్ ప్రొఫెసర్లుగా ఏ విధంగా పదోన్నతి కల్పించారు.. సెలక్షన్ కమిటీ ఆమోద పత్రాలు, ఈసీ మినిట్స్, 2022లో పీహెచ్‌డీ ప్రవేశాలు ఎలా భర్తీ చేశారు.. తదితర అంశాలపై విచారించి, వాటికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడిగిన వివిధ పత్రాలు సమర్పించడంలో వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రెండు మూడు సార్లు నోటీసులు పంపించినా వాటికి ఎలాంటి సమాధానాలు రాక పోవడంతోనే నేరుగా విచారణకు వచ్చినట్లు సమాచారం.

భారీ బతుకమ్మకు అంతర్జాతీయ రికార్డు


జనగామలోని నెహ్రూపార్కు సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో 36.2 అడుగుల భారీ బతుకమ్మ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సంబరాల్లో భాగంగా 36.2 అడుగుల బతుకమ్మను తయారు చేసి ప్రపంచంలోకెల్లా అతి పెద్ద బతుకమ్మగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. స్టీల్, వైబ్రెంట్ ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్‌తో 700 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు కలిసి 24 గంటలలోపు దీన్ని తయారు చేశారు. ఇంతకు ముందు ఉన్న 31 అడుగుల బతుకమ్మ రికార్డును అధిగమించినందున ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు నరేందర్‌గౌడ్, సుభాషిని.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసాని శ్రీధర్‌కు సదరు రికార్డు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువీకరణపత్రం

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

నఖ చిత్ర కళలో దిట్ట




దళసరి కాగితాలే క్యాన్వాస్‌గా వేలి గోర్లే కుంచెగా చేసుకుని అద్భుత కళాఖండాలు చిత్రీకరిస్తూ అబ్బురపరుస్తున్నారు నర్సంపేటకు చెందిన కళాకారుడు మండ వీరస్వామి. కవి, గేయరచయిత, గాయకుడు, చిత్రకారుడు, రంగస్థల నటుడిగానే గాక చిత్రలేఖనంలో చేయి తిరిగిన చిత్రకారుడు కూడా. చిత్రలేఖనంలో పట్టున్న ఆయన దళసరి కాగితాలపై నఖ(గోటి)తో మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం, మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు తదితరుల చిత్రాలు గీసి అబ్బురపరుస్తున్నారు. –న్యూస్‌టుడే, నర్సంపేట

5న ఉద్యోగ మేళా

కొత్తవాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న వరంగల్ ములుగురోడ్డులోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో చెన్నైలోని హిందూస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్‌లో 100 ఉద్యోగ ఖాళీలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. ఇంటర్‌లో 75శాతం మార్కులు వచ్చి, 18 నుంచి 22 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 75691 77071 సంప్రదించాలన్నారు.

చారిత్రక ప్రాంతాల సందర్శనే లక్ష్యం


బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ జీఎం కిషోర్, ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్ తదితరులు

కాజీపేట, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులకు చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించపజేయడమే లక్ష్యంగా ఐఆర్‌సీటీసీ పని చేస్తుందని సంస్థ జనరల్ మేనేజర్ కిషోర్, టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక పర్యాటక రైలుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. స్థానిక టూరిజం ఏజెంట్లకు దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత్ గౌరవ్ యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుందని చెప్పారు. నవంబరు 6న సికింద్రాబాద్ నుంచి ఈ రైలు ప్రారంభమౌతుందని తెలిపారు. ఈ యాత్రలో రామేశ్వరం, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర సందర్శన ప్రదేశాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న ప్రయాణికులు వివరాలకు 92810 30749, 92810 30750 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేదల ఇళ్ల జోలికొస్తే ఖబడ్దార్!


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చిత్రంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: నగరంలో 20, 30 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదల ఇళ్ల జోలికొస్తే సర్కారుతో సమరానికి సిద్ధమని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ఎల్బీనగర్‌లోని అబ్బూస్ వేడుకల మందిరంలో మంగళవారం 'పేద ప్రజలకు నివసించే హక్కు కల్పించాలి.. పేదల ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించాలి' అనే డిమాండ్‌తో సీపీఐ వరంగల్ జిల్లా కమిటీ నిర్వహించిన సదస్సులో కూనంనేని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు న్యాయం చేస్తుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఒక పరిధి ఉంటుందని, అది దాటి పనిచేసే అవకాశం లేదన్నారు. అధికారులు చేస్తున్న ప్రకటనలతో పేదలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రజలకు ధైర్యం చెప్పడానికి తమ పార్టీ ముందుంటుందని వివరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హైడ్రా కూల్చివేతల వల్ల పేదలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. సదస్సులో కళాకారుల ఆటపాటలు అలరించాయి. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర నేతలు పంజాల రమేశ్, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు బస్సా రవీందర్, గుండె బద్రీ, అక్కపెల్లి రమేశ్, ఆరెల్లి రవి, ల్యాదళ్ల శరత్, చిరంజీవి, అక్బర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిపేట: పేద ప్రజలకు అండగా ఎర్రజెండా నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం గవిచర్ల క్రాస్‌రోడ్‌లోని మార్కండేయనగర్‌లో ఆయన పర్యటించి మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించకుండా చూస్తామన్నారు. అనంతరం కాలనీలో ర్యాలీ చేపట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే.బాష్‌మియా, పనాస ప్రసాద్ తదితరులున్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో మంత్రి సురేఖ, నిర్వాహకులు

కొత్తవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంత్రి కొండా సురేఖ మంగళవారం ప్రారంభించారు. 'ఓం చండేశ్వరి ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్' పేరిట కొత్తవాడలోని ఇస్లామియా కళాశాల మైదానంలో భారీ సెట్లతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాజ్‌మహల్, లండన్ సిటీజోన్, ఎర్రకోట తదితర నమూనాలతో నిర్మించిన సెట్టింగ్స్ బాగున్నాయన్నారు. నిర్వాహకులు ధర్మేందర్, కొక్కుల సతీష్, అంకిత్‌కుమార్ గుప్తా, సురేష్, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఎవరయ్యా నువ్వు అసలు..!

ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పోలీసు అధికారి, మంత్రి ప్రధాన అనుచరుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. బందోబస్తు విధుల్లో ఉన్న హనుమకొండ సీఐ సతీష్.. ముందు వెళ్తున్న నవీన్‌రాజ్‌ను తోసుకుంటూ వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన మంత్రి ప్రధాన అనుచరుడు.. ఎవరయ్యా నువ్వు అసలు..! అంటూ ప్రశ్నించాడు. అక్కడే ఉన్న మట్టెవాడ ఎస్సై సాంబయ్య కల్పించుకొని సర్దిచెప్పాడు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

రంగంపేట: ఈ నెల 3 నుంచి 13 వరకు జరిగే శ్రీభద్రకాళి అమ్మవారి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రి కొండా సురేఖను ఈవో శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు ఆహ్వానించారు. మంగళవారం సాయంత్రం హనుమకొండ రాంనగర్‌లో మంత్రిని కలిసి ఆహ్వానపత్రిక, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రంగశాయిపేట: రంగశాయిపేట దసరా ఉత్సవ సమితి సభ్యులు మంత్రి కొండా సురేఖకు కలిసి ఉర్సు రంగలీలా మైదానంలో జరిగే విజయదశమి వేడుకలకు తగిన ఏర్పాటు చేయాలని విన్నవించారు.

నాగేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో అభిషేకం చేస్తున్న పూజారులు

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండ మండలం ఊకల్ హవేలీలోని శ్రీనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అభిషేకాలు నిర్వహిస్తున్న తరుణంలో స్వామివారిపై సూర్యకిరణాలు సోకాయి. ఇది అద్భుతమైన విషయమని అర్చకులు సుదర్శనాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీహర్ష, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం


వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

వర్ధన్నపేట, రాయపర్తి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేసే వరకు పోరాడుతామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం ఇల్లంద, రాయపర్తి లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దయాకర్‌రావు మాట్లాడుతూ.. పాలకుర్తి, వర్ధన్నపేటలో ఈ నెల 4న ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారాస నేతలు భిక్షపతి, అప్పారావు, గోపాల్‌రావు, కుమారస్వామి, సంపత్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి, కొంకపాక, చింతనెక్కొండ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు.

సీబీసీ చర్చి ప్రారంభం

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ క్రిస్టియన్ కాలనీలో సెంటినరీ బాప్టిస్టు చర్చి(సీబీసీ) ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన చర్చిని మంగళవారం రాజమండ్రికి చెందిన క్రిస్టియన్ మత ప్రబోధకుడు జాన్‌వెస్లీ, వరంగల్ జిల్లా కరుణాపురం చర్చి నిర్వాహకుడు పాల్సన్‌రాజ్ ప్రారంభించారు. వేడుకలకు మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు హాజరయ్యారు. అనంతరం జాన్‌వెస్లీ, పాల్సన్‌రాజ్ మాట్లాడుతూ.. నగరంలో ఇంత గొప్పగా చర్చిని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. తాను గతంలో వరంగల్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే చర్చి నిర్మాణానికి నిధులు ఇచ్చానన్నారు. మంత్రిగా మళ్లీ నిధులు ఇచ్చి చర్చి నిర్మాణంలో భాగస్వామినైనందుకు ఆనందంగా ఉందన్నారు. చర్చి కమిటీ అధ్యక్షుడు పీఆర్ సాల్మన్, కార్యదర్శి కొల్లూరి రాజ్‌కుమార్, కోశాధికారి కవిరాజ్‌టోని, పాస్టర్ పుల్లా జగ్జీవన్‌బాబ్జి, స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు, కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.


క్రిస్టియన్ కాలనీలో నూతన చర్చిని ప్రారంభిస్తున్న రాజమండ్రికి చెందిన క్రిస్టియన్ మత ప్రబోధకుడు జాన్ వెస్లీ, వరంగల్ కరుణాపురం మత ప్రబోధకుడు పాల్సన్‌రాజ్

నగరంలో కోదండ రాముని 'ధనస్సు'


వరంగల్ బాలానగర వేంకటేశ్వరాలయంలో..

రామన్నపేట, న్యూస్‌టుడే: అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన కోదండ రాముని 'ధనస్సు'ను మంగళవారం వరంగల్ బట్టలబజారు బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంచారు. దర్శనం చేసుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో తయారు చేసిన విల్లును 2025 మార్చి నెలలో అయోధ్యలోని కోదండ రాముని చేతిలో ప్రతిష్ఠించనున్నట్లు సీతారామ సేవా ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ ఏలపాటి రత్నాకర్‌రెడ్డి, ఛైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిపై దుష్ప్రచారం మానుకోండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ శామంతుల శ్రీనివాస్, న్యాయవాదులు

శివనగర్, న్యూస్‌టుడే: మంత్రి కొండా సురేఖపై భారాస నేతలు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని, ఆమె జోలికొస్తే సహించేదిలేదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్‌సెల్ ఛైర్మన్ శామంతుల శ్రీనివాస్, లీగల్‌సెల్ న్యాయవాదులు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ముదసిర్ మహ్మద్ ఖయ్యూం, వరంగల్ జిల్లా వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, రమేశ్, గంప వెంకటరమణ, హరిహర కుమార్, సురేష్, రోడ్ల అమృతరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రంగంపేట: మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న భారాస నాయకుల్ని గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


విద్యార్థులతో అనుజ్ అగర్వాల్, వెంకట్రాంరెడ్డి, నారాయణరెడ్డి, సరితారెడ్డి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్ తెలిపారు. మంగళవారం రంగశాయిపేట శివారులోని 'ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌'లో జరిగిన విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థి నాయకులుగా నియమితులైన పెరుమల విశాల్, గోలి నిక్షిత, ఇతర విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రొఫెసర్ బి.వెంకట్రాంరెడ్డి, నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సరితారెడ్డి పాల్గొన్నారు.

భాజపా నేతల ఆందోళన


వర్ధన్నపేటలో భాజపా, హిందూ సంఘాల నేతలు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దేవాలయాల గురించి చేసిన దిగజారుడు వ్యాఖ్యలకు నిరసనగా భాజపా, హిందూ సంఘాల నేతలు మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందువుల మనోభావాలు కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న భాజపా, హిందూ సంఘాల నేతలను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నేతలు మహేందర్‌రెడ్డి, కుమారస్వామి, దేవేందర్, రాజు, యాకయ్య, గోపి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా కోర్టు ఆవరణ శుభ్రం చేస్తున్న వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ, న్యాయమూర్తులు మనీషా శ్రావణ్ ఉన్నమ్, సాయికుమార్, చండీశ్వరీదేవి, శశి, కోర్టు సిబ్బంది

– న్యూస్‌టుడే, వరంగల్ న్యాయ విభాగం

ముందస్తుగా పూల పండగ

వరంగల్ ప్రాంతంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. చిన్నారులు, యువతులు, మహిళా అధ్యాపకులు ఆకట్టుకునేలా బతుకమ్మలు పేర్చి.. ఉత్సాహంగా ఆడిపాడారు. డీజే పాటలకు అనుగుణంగా బతుకమ్మ ఆడారు. మచ్చాపురంలో బొడ్డెమ్మ చివర రోజైన మంగళవారం మహిళలు బొడ్డెమ్మ వద్ద పాటలు పాడి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం


గురిజాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు


నర్సంపేటలో పాల్గొన్న కౌన్సిలర్లు రమాదేవి, రాజేందర్, ఉపాధ్యాయురాళ్లు


రంగశాయిపేట శారద హై స్కూల్లో..


ఎల్బీనగర్ స్కాలర్స్ పాఠశాలలో..


నర్సంపేట డఫోడిల్స్ పాఠశాలలో


నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో


హంటర్‌రోడ్ గ్రీన్‌వుడ్ స్కూల్లో..


పర్వతగిరిలో..


లక్నేపల్లి బాలాజీ టెక్నో పాఠశాలలో..


రంగశాయిపేట అరవింద పబ్లిక్ స్కూల్లో..


వరంగల్ ఫోర్టురోడ్డు విద్యానగర్‌కాలనీలో..


బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు


నల్లబెల్లిలోని కారుణ్యజ్యోతి పాఠశాలలో..


ఖానాపురంలో..


శివనగర్‌లోని ఏకశిలా డిజీ స్కూల్‌లో..


చెన్నారావుపేటలో..

బాలుడి వైద్యానికి ఆర్థిక చేయూత



శివనగర్, న్యూస్‌టుడే: ఇటీవల బట్టల బజార్ రైల్వేబ్రిడ్జిపై నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడి ట్రాక్టరును అంబులెన్స్ ఢీ కొన్న ప్రమాదంలో పెరుకవాడకు చెందిన చింతనూరి హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వైద్యానికి దాతలు మంగళవారం రూ.82,100 నగదు అందించి ఆదుకున్నారు. పెరుకవాడకు చెందిన మెంగన నరేష్, అడుప అవినాష్, తన్నీరు శ్రీకాంత్, పుప్పాల శ్రీనివాస్, రాజు తదితరులు ముందుండి బాలుడి కోసం విరాళాలు సేకరించారు.

డీఎస్సీ జాబితా కోసం అభ్యర్థుల ఎదురుచూపులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ఫలితాలను ప్రభుత్వం ప్రకటించింది. అందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 301 పోస్టుల ఖాళీలకు 1:3 ప్రాతిపదికన 903 మంది అభ్యర్థులకు హాజరుకావాలని అధికారులు సూచించారు. వీరికోసం హనుమకొండ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు కేంద్రానికి ఉదయం పదిగంటల వరకు చేరుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి జాబితా రాకపోవడంతో అభ్యర్థులు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూశారు. జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి జాబితా వచ్చిన తదుపరి నిబంధనలతో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణికే సమాచారం పంపించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి వరకు పడిగాపులు కాసిన అభ్యర్థులు కేంద్రం నుంచి వెళ్లిపోయారు. బుధవారం నుంచి ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు తెలిసింది.

రక్తదాతలకు సత్కారం



ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంజీఎం ఆసుపత్రిలో నిర్వహించిన శిబిరానికి స్పందన లభించింది. గత కొన్ని సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్న పలువురు దాతలను ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చిలుక మురళి, కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి ఆర్‌ఎంఓలు సత్కరించి, ప్రశంసాపత్రాలు అందించారు. ఆర్‌ఎంవోలు డా.మురళి, డా.అంబి శ్రీనివాస్, బ్లడ్ బ్యాంకు వైద్యాధికారి డా.ఆశాదేవి, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

బాలికను గర్భవతిని చేసిన వృద్ధుడు

గీసుకొండ, న్యూస్‌టుడే: అభంశుభం తెలియని పన్నెండేళ్ల బాలికను ఓ వృద్ధుడు గర్భవతిని చేసిన ఉదంతం ఇది. గీసుకొండ మండలంలో మంగళవారం ఈ దురాగతం వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య(65) ఇంటి పక్కనే ఉంటున్న 12ఏళ్ల బాలికపై కన్నేశాడు. బాలిక తండ్రి కొద్ది రోజుల క్రితం మృతిచెందగా.. తల్లి ఆమె తన ఇద్దరు కొడుకులు, కుమార్తె(12)ను వదిలేసి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అన్నదమ్ములతో కలిసి ఉంటున్న బాలికపై సాంబయ్య కన్నుపడింది. సోదరులు లేని సమయంలో సాంబయ్య బాలికకు మాయమాటలు చెప్పి ఆమెను లోబరుచుకున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన తల్లికి బాలిక ఈ విషయం చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీకేఎం ఆసుపత్రిలో మంగళవారం బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో నాలుగు నెలల గర్భవతని వైద్యులు నిర్ధారించారు. బాలికను వసతిగృహానికి తరలించి పోలీసులు సాంబయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

గీసుకొండ, న్యూస్‌టుడే: వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారిలోని కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆర్చిగేటు వద్ద మంగళవారం రాత్రి కారు ఢీకొని గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తునన చంద్రశేఖర్ అనే కానిస్టేబుల్ తలకు తీవ్రంగా గాయమైంది. విధుల్లో భాగంగా చంద్రశేఖర్ రాత్రి 10 గంటలకు ద్విచక్ర వాహనంపై కొమ్మాల గుట్ట వద్దకు వెలుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

మరో ఘటనలో తండ్రి, కూతుళ్లకు..

ఖానాపురం, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం పెగడపల్లికి చెందిన మధు మంగళవారం ద్విచక్ర వాహనంపై తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని నర్సంపేట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కొత్తగూడ నుంచి నర్సంపేటకు వస్తున్న కారు చిలుకమ్మనగర్ సమీపంలో ఢీకొంది. మధుకు కాలు విరగ్గా, ఆయన ఇద్దరు కుమార్తెలకు స్వల్ప గాయాలయ్యాయి.

నర్సంపేట నియోజకవర్గం

వాకర్స్ ఇంటర్నేషనల్ 303 గవర్నర్ శ్రీనివాస్



నర్సంపేట, న్యూస్‌టుడే: వాకర్స్ ఇంటర్నేషనల్ 303 గవర్నర్‌గా నర్సంపేటకు చెందిన పుల్లూరు శ్రీనివాస్ ఎంపికైనట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఇసాక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఆ సంఘం 159వ కౌన్సిల్ సమావేశంలో శ్రీనివాస్‌ను ఇంటర్నేషనల్ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇసాక్ పేర్కొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల నిరసన



నల్లబెల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ నియమాలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చెత్త పేరుకుపోవడాన్ని నిరసిస్తూ ఆరుబయట పేరుకుపోయిన చెత్తాచెదారంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్వచ్ఛత కార్యక్రమాలు పారదర్శకంగా అమలు చేయాలని కోరారు.

ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సంపేట మినీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో లక్నేపల్లి బాలాజీ టెక్నో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కబడ్డీలో సంజన, యువరాణి, దీపిక, రాజన్న, శివశ్యామ్, సాయిచరణ్, వాలీబాల్ క్రీడలో రాజేశ్, తరుణ్ రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మంగళవారం వారిని బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ డా.రాజేంద్రప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

సంఘ అభివృద్ధికి సహకరిద్దాం

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంఘం అభివృద్ధికి అందరం సహకరిద్దామని సిద్ధార్థ విద్యా సంస్థల ఛైర్మన్ గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా చెన్నారావుపేటలో మంగళవారం సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్‌రెడ్డి మాట్లాడారు. సంఘానికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, సొంత ఖర్చుతో గది నిర్మించి సంఘానికి అప్పగిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీవాణి, ఎస్సై రాజేష్‌రెడ్డి, సంఘ సభ్యులు సాంబయ్య, కుమారస్వామి, వయోవృద్ధులు పాల్గొన్నారు.

మాంసాహార విక్రయాలు నిషేధం

నర్సంపేట, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని నర్సంపేట పట్టణంలో బుధవారం చికెన్, మటన్, చేపల విక్రయాలు, మాంసాహారాల విక్రయాలు నిషేధించినట్లు పురపాలక కమిషనర్ జోనా ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

వైద్య విద్యలో ప్రవేశం పొందిన విద్యార్థిని


హిమ శివానిరెడ్డి

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నల్లబెల్లికి చెందిన కల్లెం హిమ శివానిరెడ్డి నీట్ ఫలితాల్లో 559 మార్కులు సాధించి వైద్య విద్యలో ప్రవేశం పొందినట్లు విద్యార్థిని తండ్రి పాపిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కోటాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ప్రవేశం లభించినట్లు ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నెక్కొండ, న్యూస్‌టుడే: స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని ఎరుకల వాడలో భిక్షాటన చేసే గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఎవరైనా గుర్తు పడితే స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.